

ప్రశాంతంగా లాసెట్, ఎడ్‌సెట్ పరీక్షలు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

రాష్ట్రవ్యాప్తంగా ఉన్న లా, బిఇడి కళాశాలల్లో ప్రవేశాలకుగాను గురువారం నిర్వహించిన లాసెట్, ఎడ్‌సెట్ పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. శ్రీ వాసవి ఇంజినీరింగ్ కళాశాలలో ఉదయం జరిగిన లాసెట్ పరీక్షకు 241 మందికి 204 మంది హాజరయ్యారు. సాయంత్రం జరిగిన ఎడ్‌సెట్ పరీక్షకు 240 మందికి 197 మంది హాజరైనట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రత్నాకరరావు తెలిపారు. సెంటర్ అడ్మినిస్ట్రేటర్ నటరాజ్, సిస్టమ్ అడ్మిన్ కొల్ల సురేష్, టిసిఎస్ సంస్థ ప్రతినిధులు పరీక్ష నిర్వహణను పర్యవేక్షించారు. శశి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ ఇంజినీరింగ్ కళాశాలలో మొదటి షిఫ్టులో నిర్వహించిన లాసెట్ పరీక్షకు 125 మంది అభ్యర్థులకుగాను 96 మంది హాజరయ్యారు. మధ్యాహ్నం నిర్వహించిన ఎడ్‌సెట్ పరీక్షకు 125 మంది అభ్యర్థులకు 94 మంది హాజరయ్యారు. పరీక్షలు ప్రశాంతంగా ముగిసినట్లు కళాశాల ప్రిన్సిపల్ మహ్మద్ తెలిపారు.

ఉపాధి బకాయిలకు మోక్షం..!

- నెలా 20 రోజుల నుంచి ఉపాధి శ్రామికులకు అందని వేతనాలు
- ఏలూరు జిల్లాలో రూ.124 కోట్లు, పశ్చిమలో రూ.45 కోట్లు పెండింగ్
- ఏప్రిల్ నుంచి రెండు జిల్లాల్లో 31 లక్షల పని దినాలు నమోదు
- ఉపాధి హామీ వేతన సొమ్ము విడుదలైనట్లు డ్వామా అధికారులు వెల్లడి
- వారంలోపే శ్రామికుల ఖాతాల్లో జమయ్యే అవకాశం
- వేతనాల ఆలస్యంపై ఉపాధి శ్రామికుల్లో తీవ్ర అసహనం



ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఉపాధి శ్రామికులకు ఎట్టకేలకు కూలి డబ్బులు అందనున్నాయి. గడిచిన నెలా 20 రోజులుగా చేసిన పనికి కూలి సొమ్ము అందకపోవడంతో ఉపాధి శ్రామికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చేసిన పనులను ఎప్పటికప్పుడు డ్వామా అధికారులు ఆన్‌లైన్‌లో నమోదు చేసి పంపిస్తున్నా సొమ్ము విడుదలలో కేంద్ర ప్రభుత్వం తీవ్ర అలసత్వం ప్రదర్శిస్తోంది. సకాలంలో కూలి సొమ్ము అందక ఉపాధి శ్రామికుల కుటుంబ పోషణ కష్టంగా మారుతోంది. రెక్కాడితే తప్ప డొక్కాడని కుటుంబాలు ఎక్కువ. వారానికి సొమ్ము అందితేనే బతుకు బండి నడుస్తుంది. ఉపాధి కూలి సొమ్ము నెలలు తరబడి పెండింగ్ పెట్టడంతో శ్రామికులు ఆర్థికంగా నలిగిపోతున్నారు. రెండు జిల్లాల్లోనూ ఏప్రిల్ 14వ తేదీ తర్వాత ఉపాధి శ్రామికులకు కూలి సొమ్ము అందలేదు. దీంతో వారంతా కూలి డబ్బులు కోసం కళ్లు కాయలు కాసేలా ఎదురుచూస్తున్నారు. ఏలూరు జిల్లాలో 4.85 లక్షల వరకూ జాబ్‌కార్డుదారులు పని చేస్తున్నారు. ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి ఇప్పటి వరకూ 55 లక్షల పని దినాలు చూపారు. ఉపాధి శ్రామికులకు వేతనాల కింద రూ.124 కోట్లు వరకూ రావాల్సి ఉంది. పశ్చిమగోదావరి జిల్లాలో ఏప్రిల్ నుంచి 16 లక్షల పని దినాలు జరగ్గా, రూ.45 కోట్లు వరకూ ఉపాధి శ్రామికులకు వేతనాలు అందాల్సి ఉంది. నెల 20 రోజులుగా కూలి సొమ్ము అందకపోవడంతో శ్రామికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. డ్వామా అధికారులపైనా శ్రామికుల నుంచి తీవ్రమైన ఒత్తిడి పెరిగింది. ఉపాధి వేతనాలు సకాలంలో చెల్లించాలని శ్రామికులు కోరుతున్నారు.

ఎట్టకేలకు కూలి సొమ్ము విడుదల

ఉపాధి హామీ బకాయిల సొమ్ములు విడుదలైనట్లు ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల డ్వామా అధికారులు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఉపాధి వేతన బకాయిల కింద రూ.వెయ్యి కోట్లు వరకూ విడుదలైనట్లు తెలిసింది. ఏలూరు జిల్లాకు రూ.124 కోట్లు, పశ్చిమకు రూ.45 కోట్లు వేతన బకాయిలు ఉన్నాయి. రెండు జిల్లాలకు పూర్తిస్థాయిలో వేతన బకాయిలు విడుదల అవుతాయా.. లేక ఇంకా పెండింగ్ ఉంటుందా అనేది తెలియాల్సి ఉంది. ఇప్పటికే ఉపాధి శ్రామికుల ఖాతాల్లో వేతన సొమ్ములు జమవుతున్నాయని, వారంలోపే శ్రామికులకు ఉపాధి వేతనాల సొమ్ము అందనుందని చెబుతున్నారు. కూలి సొమ్ము జమైన తర్వాత ఎన్ని పని దినాలకు చెల్లించారో స్పష్టత రానుంది. వేతన బకాయిల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం చొరవతీసుకుని త్వరితగతిన వచ్చేలా చర్యలు తీసుకోవాలని ఉపాధి శ్రామికులు కోరుతున్నారు.

ప్లాస్టిక్ నియంత్రణే లక్ష్యం

కలెక్టర్ నాగరాణి - కలెక్టరేట్‌లో మొక్కలు నాటిన జిల్లా అధికారులు



పాలకొల్లు : కూటమి నేతలుచే ప్రతిజ్ఞ చేయించిన మంత్రి నిమ్మల



మొక్కలు నాటుతున్న కలెక్టర్, జెసి, ఎస్‌పి

ప్రజాశక్తి - భీమవరం

మొక్కలు నాటడంతోపాటు, ప్రకృతి సమతుల్యతను కాపాడటానికి కాలుష్య కారకంగా ఉన్న ప్లాస్టిక్ నియంత్రణే లక్ష్యంగా కృషి చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. శుక్రవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా అంతటా 'వనం-మనం' పేరిట మొక్కలు నాటడం, కాలవలు, డ్రెయిన్లలో ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించే కార్యక్రమాన్ని పెద్దఎత్తున చేపట్టారు. దీనిలో భాగంగా కలెక్టర్ నాగరాణి, జిల్లా ఎస్‌పి అద్నాన్ నయీం అస్మి, జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి, డిఆర్‌ఒ మొగిలి వెంకటేశ్వర్లు, వివిధ శాఖల జిల్లా అధికారులు స్థానిక కలెక్టరేట్లో మొక్కలు నాటే కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. అనంతరం విస్సాకోడేరు కాలువ వెంబడి ప్లాస్టిక్ వ్యర్థాలను, జెపి రోడ్డులోని అడ్డ వంతెన వద్ద కాల్వ గట్లపై ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించే కార్యక్రమంలో కలెక్టర్ స్వయంగా పాల్గొన్నారు. ఇరిగేషన్ శాఖ ఆధ్వర్యంలో కాల్వల్లోని వ్యర్థాల తొలగింపు పనులను ఆమె పరిశీలించి ఇరిగేషన్ అధికారులకు పలు సూచనలు చేశారు. వ్యర్థాల తొలగింపులో భాగంగా గట్లపై వేసిన మట్టిని ఒకటి, రెండు రోజుల్లో వేరే ప్రాంతానికి తరలించాలని ఆదేశించారు. భీమవరం పట్టణంలో ప్రధానంగా ఉన్న నాలుగు కాలువల్లో ఇదేవిధంగా వ్యర్థాల తొలగింపు పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని ఆదేశించారు. కాల్వ గట్ల వెంబడి కొబ్బరిబొండాల బళ్లు ఎట్టి పరిస్థితుల్లో పెట్టడానికి వీల్లేదని, దీనిపై చర్యలు తీసుకోవాలని మున్సిపల్, పోలీస్ అధికారులకు సూచించారు. కాల్వగట్లపై కొబ్బరి బొండాల బళ్లు పెట్టి తాగి పడేసిన బొండాలను కాలువల్లో వేస్తున్నారని, ఇలా వేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ ప్రపంచ పర్యావరణ దినోత్సవంలో భాగంగా జిల్లావ్యాప్తంగా 3.85 లక్షల మొక్కలను నాటే కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. ఇంటి ఆవరణలోనూ, బయట బహిరంగ ప్రదేశంలోను మొక్కలు నాటి వాతావరణ సమతుల్యతలో మార్పు తీసుకురావాలని కోరారు. అటవీశాఖ పర్యవేక్షణలో జిల్లాలోని వెంకటరామన్నగూడెం, సీతారామపురం, కొణితివాడ గ్రామాల్లో నర్సరీలను అభివృద్ధి చేసినట్లు తెలిపారు. వేప, మర్రి, రావి, నేరేడు వంటి చెట్ల పెంపకానికి ప్రాధాన్యత ఇస్తున్నామని, ఈ మొక్కల పెంపకంతో పచ్చదనం పొందడంతోపాటు కాలుష్యం తగ్గడం, ప్రాణవాయువు వృద్ధి చెందుతుందన్నారు. జిల్లాలో మొక్కల పెంపకంతో పర్యావరణ సమతుల్యాన్ని కాపాడటంతోపాటు కాలుష్యాన్ని తగ్గించి పర్యావరణాన్ని పరిరక్షించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామన్నారు. ఇప్పటికే జిల్లాలో ప్లాస్టిక్ నిషేధం కొనసాగుతుందని, ప్రజల్లో పెద్దఎత్తున అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. మొక్కలే మనిషికి ప్రాణవాయువు అని, ప్రతిఒక్కరూ బాధ్యతగా మొక్కలను నాటాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎఎస్‌పి వి.భీమారావు, జిల్లా అటవీ శాఖాధికారి డి.ఆశాకిరణ్, కెఆర్‌ఆర్‌సి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శివన్నారాయణరెడ్డి, జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ అధికారి డాక్టర్ కెసిహెచ్.అప్పారావు, డిఆర్‌డిఎ పీడీ ఎంఎస్ఎస్.వేణుగోపాల్, ఆర్‌డిఒలు కె.ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, దాసి రాజు, కతీబ్ కౌసర్‌భానో, భీమవరం మున్సిపల్ కమిషనర్ కె.రామచంద్రారెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలి : నిమ్మల

పాలకొల్లు: మానవ మనుగడలో కీలకమైన పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు అన్నారు. స్థానిక మున్సిపల్ పార్క్‌లో నిర్వహించిన వన మహోత్సవ కార్యక్రమంలో కూటమి నాయకులు, మహిళలతో కలిసి ఆయన మొక్కలు నాటారు. ముందుగా అందరిచే ప్రతిజ్ఞ చేయించారు. మంత్రి రామానాయుడు మాట్లాడుతూ సిఎం చంద్రబాబు స్వచ్ఛంధ్రాప్రదేశ్‌గా, హరితాంధ్రప్రదేశ్‌గా తీసుకెళ్లేందుకు రాష్ట్రవ్యాప్తంగా కోటి మొక్కలు నాటడంతోపాటు ప్లాస్టిక్ నివారణా కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ విజయసారథి, కూటమి నాయకులు బోనం చినబాబు, తులా రామలింగేశ్వరరావు, శిడగం సురేంద్ర, ఉన్నమట్ల కబర్ది, ప్రేమ్‌కుమార్, మల్లంపల్లి ఫకీర్‌బాబు, బిట్ట లక్ష్మీనారాయణ, విన్నకోట గోపీ, గాదె వెంకన్న, బందెల భాస్కరరావు, పొట్లూరి అప్పన్న, బాలి ఏడుకొండలు, శ్రీకాకొల్లు వెంకన్న, జికె.గణపతి పాల్గొన్నారు.

నేటి నుంచి డిఎస్‌సి పరీక్షలు

ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు

ప్రజాశక్తి - భీమవరం

మెగా డిఎస్‌సి-2025 పరీక్షలు ఈ నెల ఆరో తేదీ శుక్రవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ పరీక్షలు ఈ నెల 30వ తేదీ వరకూ కొనసాగనున్నాయి. ఈ పరీక్షలకు ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో ఆయా జిల్లా అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. ఏలూరులోని వట్లూరులో సిద్ధార్థ క్వెస్ట్ పాఠశాలలోనూ, సిఆర్‌రెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలోనూ, ఏలూరు ఇంజినీరింగ్ కళాశాలలోనూ ఆన్‌లైన్ విధానంలో ఉదయం 9:30 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, తిరిగి మధ్యాహ్నం రెండున్నర గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు ఈ పరీక్షలు జరగనున్నాయి. టిసిఎస్ కంపెనీ ఈ పరీక్షలు నిర్వహించనుంది. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లావ్యాప్తంగా మొత్తం 1035 ఉపాధ్యాయ పోస్టులు ఈ డిఎస్‌సి ద్వారా భర్తీ చేయనున్నారు. ఇందులో 837 ప్రభుత్వ, స్థానిక సంస్థల పాఠశాలల్లోని పోస్టులు ఉండగా, మున్సిపల్ పరిధిలో 153, మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 45 పోస్టులు ఉన్నాయి. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 25,750 మంది అభ్యర్థులు 42,466 దరఖాస్తులు చేశారు. ఇందులో 9,290 మంది పురుషులు, 16,460 మంది స్త్రీలు ఉన్నారు. ఏలూరు జిల్లాకు సంబంధించి ఏలూరులోని మూడు కేంద్రాల్లో 17,238 మంది అభ్యర్థులు డిఎస్‌సి పరీక్షలు రాయనున్నారు. అభ్యర్థులు గంట ముందుగానే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

ఇక పశ్చిమగోదావరి జిల్లాలో ఐదు కేంద్రాల్లో నిర్వహించే పరీక్షలకు 16,634 మంది అభ్యర్థులు హాజరు కానున్నారు. భీమవరం డిఎన్‌ఆర్ కాలేజీ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ, దంతులూరి నారాయణరాజు కాలేజీ, తాడేపల్లిగూడెం శ్రీ వాసవి ఇంజినీరింగ్ కాలేజీ, శశి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ ఇంజినీరింగ్, నరసాపురంలో స్వర్ణాంధ్ర కాలేజీ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. హాల్‌టిక్కెట్‌తోపాటు ఆధార్ కార్డ్, పాన్ కార్డ్, డ్రైవింగ్ లైసెన్స్, ఏదో ఒక ఫోటో ఐడెంటిటీ కార్డును తప్పనిసరిగా తీసుకెళ్లాలి.

హాల్‌టిక్కెట్‌లో తప్పులు సరిదిద్దుకునే అవకాశం

డిఎస్‌సి హాల్‌టిక్కెట్‌లో ఏమైనా తప్పులు ఉంటే వాటిని సరిదిద్దుకునే అవకాశం ఉంది. ఏదైతే తప్పు నమోదైందో, దానికి సంబంధించిన ఒరిజినల్ సర్టిఫికెట్ చూపించి, ధ్రువీకరించిన దాని జెరాక్స్ కాపీని అందజేసి, పరీక్షా కేంద్రం వద్దే సరిచేసుకోవచ్చు. తప్పులు సరిచేయించుకొనేవారు గంట ముందుగానే పరీక్షా కేంద్రానికి చేరుకోవాలి.

జులై 9న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలి

సిఐటియు పిలుపు

ప్రజాశక్తి - భీమవరం

ఉద్యోగ, కార్మికులకు నష్టం కలిగించే లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని కోరుతూ జులై 9న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ఆఫీస్ బేరర్స్ సమావేశం పిలుపునిచ్చింది. జిల్లాలో సమ్మె జయప్రదానికి దశలవారీ కార్యక్రమాలను నిర్వహించాలని నిర్ణయించింది. స్థానిక యుటిఎఫ్ కార్యాలయంలో సిఐటియు జిల్లా ఆఫీస్ బేరర్స్ సమావేశం జిల్లా అధ్యక్షులు జెఎన్‌వి.గోపాలన్ అధ్యక్షతన గురువారం జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాజారామ్మోహన్‌రాయ్ మాట్లాడుతూ గత నెలలో జరగాల్సిన సమ్మెను పాకిస్తాన్‌లో ఉగ్రవాద శిబిరాలపై ఆపరేషన్ సింధూరను భారత ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో కేంద్ర కార్మిక సంఘాలు వాయిదా వేసి జులై 9న జరపాలని నిర్ణయించాయన్నారు. ఈ నేపథ్యంలో జిల్లాలోని కార్మిక, ఉద్యోగ సంఘాలు ఈ సమ్మెను విజయవంతం చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం లేబర్ కోడ్‌లను అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి చేస్తుందని, దానిలో భాగంగానే రాష్ట్రంలో కూడా పని గంటలు పెంచడం, మహిళలకు నైట్ డ్యూటీలను అనుమతించడం వంటి చర్యలను కూటమి ప్రభుత్వం చేపడుతుందన్నారు. పరిశ్రమల్లో ప్రమాదాలు జరిగి కార్మికులు ప్రాణాలు కోల్పోతున్నా, పెరిగిన ధరలకు అనుగుణంగా యాజమాన్యాలు వేతనాలు ఇవ్వకపోయినా ప్రభుత్వాలు స్పందించడం లేదని విమర్శించారు. తక్షణమే లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నేతలు పివి.ప్రతాప్, కర్రి నాగేశ్వరరావు, ఎస్.రంగారావు, జె.శ్రీనివాస్, ఎం.త్రిమూర్తులు, డి.కళ్యాణి పాల్గొన్నారు.

కొనసాగిన సిపిఎం మోటార్ సైకిల్ యాత్ర



మాట్లాడుతున్న సిపిఎం పట్టణ నాయకులు వైకుంఠరావు

ప్రజాశక్తి - భీమవరం

టిడ్కో గృహాలు, ప్రభుత్వ లేఅవుట్లు, ప్రభుత్వ పోరంబోకు స్థలాల్లో నివశిస్తున్న వారందరికీ ఇళ్ల పట్టాలు ఇవ్వాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యంలో పట్టణంలో చేపట్టిన మోటార్ సైకిల్ యాత్ర రెండో రోజు గురువారం కొనసాగింది. రెస్ట్‌హౌస్ రోడ్డు, చిన్న అప్పారావు తోట, చిన్నపేట, ముస్లిం వీధి, రెల్లి కాలనీ, బండారప్పరావు వీధి ప్రాంతాల్లో మోటార్ సైకిల్ యాత్ర సాగింది. ఈ సందర్భంగా సిపిఎం పట్టణ నాయకులు ఎం.వైకుంఠరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయకపోవడం సిగ్గుచేటన్నారు. టిడ్కో ఇళ్ల నిర్మాణం పూర్తయినప్పటికీ లబ్ధిదారులకు అందించకపోవడం దుర్మార్గమన్నారు. ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం రూ.6 లక్షలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కేరళలో ప్రభుత్వమే ఇల్లు నిర్మించి లబ్ధిదారులకు ఇస్తుందన్నారు. తాము అధికారంలోకి వస్తే ఎటువంటి భారాలూ వేయబోమని చెప్పి ఆస్తి పన్ను, విద్యుత్ ఛార్జీలు, నిత్యావసరాల ధరలు పెంచడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు చెల్లబోయిన వెంకటేశ్వరరావు, డి.నాగు, డి.త్రిమూర్తులు, నాగరాజు, ఆదినారాయణ, సత్యనారాయణ పాల్గొన్నారు.

నేర పరిశోధనలో డ్రోన్ కెమెరాలు కీలకం

డిప్యూటీ స్పీకర్ కనుమూరు రఘురామకృష్ణరాజు



పోలీస్ స్టేషన్లో డ్రోన్ కెమెరాను ఆపరేట్ చేసి ప్రారంభిస్తున్న రఘురామకృష్ణరాజు

ప్రజాశక్తి - ఆకివీడు

నేర పరిశోధనకు డ్రోన్ కెమెరాలు ఎంతగానో ఉపయోగపడతాయని డిప్యూటీ స్పీకర్, ఉండి ఎంఎల్‌ఎ కనుమూరు రఘురామకృష్ణరాజు అన్నారు. గురువారం స్థానిక సర్కిల్ పోలీస్ స్టేషన్‌కు స్థానికులు సహకారంతో ఆయన డ్రోన్ కెమెరాను బహుకరించారు. అనంతరం ప్రపంచ పర్యావరణ దినోత్సవ సందర్భంగా పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాత్రిపూట చీకట్లోనూ పనిచేసేలా సీసీ కెమెరాలు అమరుస్తున్నామన్నారు. ప్లాస్టిక్ వాడకాన్ని ప్రతిఒక్కరూ మానేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌పి అద్నాన్ నయీమ్ అస్మీ, ఎఎస్‌పి భీమారావు, డిఎస్‌పి జయసూర్య, సిఐ జగదీష్, ఎస్ఐ నాగరాజు, టిడిపి మండలాధ్యక్షులు మోటుపల్లి రామవరప్రసాద్, ఎఎంసి ఛైర్మన్ బొల్లా వెంకట్రావు, ప్రముఖులు పాల్గొన్నారు. అనంతరం స్థానిక ప్రయివేటు ఆసుపత్రిని ఆయన ప్రారంభించారు. అక్కడికే ఇటీవల అత్యా చారానికి గురైన బాలికను, తల్లిదండ్రులను పిలిపించుకుని డిప్యూటీస్పీకర్ రఘురామకృష్ణరాజు మాట్లాడారు.

కొత్తపల్లి విక్టర్‌బాబుపై పీడీ యాక్ట్

జిల్లా ఎస్‌పి అద్నాన్ నయీం అస్మీ

ప్రజాశక్తి - భీమవరం టౌన్

చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని, అందులో భాగంగానే కొత్తపల్లి విక్టర్‌బాబుపై పీడీ యాక్టు ప్రయోగించామని జిల్లా ఎస్‌పి అద్నాన్ నయీం అస్మీ అన్నారు. గురువారం స్థానిక వన్‌టౌన్ పోలీస్ స్టేషన్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో శాంతిభద్రతలకు భంగం కల్గిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. భీమవరం చిన్న అప్పారావుతోటకు చెందిన కొత్తపల్లి విక్టర్‌బాబు చట్టాన్ని తరచూ ఉల్లంఘిస్తూ ప్రజాశాంతికి విఘాతం కలిగిస్తున్నాడని, దీంతో అతనిపై పీడీ యాక్ట్ ప్రయోగించామని తెలిపారు. విక్టర్‌బాబుపై 2017లో వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో రౌడీషీట్ తెరిచారన్నారు. అయినప్పటికీ వన్‌టౌన్, టూటౌన్‌తోపాటు కాళ్ల, ఉండి పోలీస్ స్టేషన్ల పరిధిలో తరచూ చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడటంతో ముందస్తు నేర నియంత్రణ చర్యల్లో భాగంగా నిర్బంధించి విక్టర్‌ను రాజమండ్రి సెంట్రల్ జైలుకు తరలించామన్నారు. సమావేశంలో డిఎస్‌పి జయసూర్య, వన్‌టౌన్ సిఐ నాగరాజు పాల్గొన్నారు.

ప్రభుత్వాసుపత్రుల్లో ప్రసవాలను ప్రోత్సహించాలి

రోగుల నుండి సొమ్ము వసూలు చేస్తే కఠిన చర్యలు

కలెక్టర్ చదలవాడ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

ప్రభుత్వాసుపత్రుల్లో ప్రసవాలను ప్రోత్సహించాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. ప్రభుత్వ వైద్యులు సేవా భావంతో రోగులకు సేవలు అందించాలన్నారు. రోగుల నుండి సిబ్బంది డబ్బులు వసూలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గురువారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో వైద్యాధికారులు, ఏరియా ఆసుపత్రి డాక్టర్లు, సూపరింటెండెంట్లతో ప్రభుత్వాసుపత్రుల్లో ప్రసవాలు, రోగులకు అందుతున్న సేవలు, మౌలిక సదుపాయాల కల్పన, పారిశుధ్య నిర్వహణ వంటి అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ప్రతి ఆసుపత్రిలో తాగునీటి సదుపాయం, టాయిలెట్ల ఏర్పాటు, పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఆసుపత్రులకు వచ్చే రోగుల నుండి సిబ్బంది డబ్బులు వసూలు చేస్తున్నట్టు తెలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. డాక్టర్లు సమయ పాలన పాటించాలని, సెలవుపై వెళ్లాలంటే ముందస్తు అనుమతి తీసుకోవాలని అన్నారు. పి4 కార్యక్రమంలో భాగంగా జిల్లాలో మార్గదర్శకులను ఎంపిక చేసి వారికి సంబంధించిన వివరాలు వెబ్‌సైట్లో పొందుపరిచి బంగారు కుటుంబాలతో అనుసంధానం చేసే ప్రక్రియను ప్రారంభించాలన్నారు. డిసిహెచ్ఎస్ డాక్టర్ పగడాల సూర్యనారాయణ, కంటిపూడి శ్రీనివాసరావు, జిల్లా బిసి సంక్షేమ శాఖాధికారి గణపతిరావు, జిల్లా హ్యాండ్లూమ్, టెక్స్‌టైల్స్ అధికారి అప్పారావు పాల్గొన్నారు..

నిబంధనలకు విరుద్ధంగా పుస్తకాల అమ్మకాలు

డిప్యూటీ తహశీల్దార్‌కు ఎస్ఎఫ్ఐ వినతి



డిప్యూటీ తహశీల్దార్ రాజుకు వినతి అందజేత

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

పట్టణంలో ప్రయివేటు, కార్పొరేట్ విద్యాసంస్థల్లో ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా పుస్తకాలు అమ్ముతున్నారని, ముందస్తు అడ్మిషన్లు నిర్వహిస్తున్నారని, వీటిని నివారించి విద్యాహక్కు చట్టాన్ని పూర్తిస్థాయిలో అమలు చేయాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో గురువారం ఆర్‌డిఒ కార్యాలయ సిబ్బందికి, డిప్యూటీ తహశీల్దార్ రాజుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ పట్టణాధ్యక్షులు పతివాడ నాగేంద్రబాబు మాట్లాడుతూ విద్యాహక్కు చట్ట ప్రకారం విద్యాసంస్థల్లో పుస్తకాలు అమ్మడం నిషేధమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం జూన్ 12వ తేదీ వరకు పాఠశాలలు నిర్వహించొద్దని తెలియజేసినా పట్టణంలోని శ్రీ చైతన్య, నారాయణ, శశి విద్యాసంస్థలు నిబంధనలను గాలికొదిలేసి పాఠశాలలు నిర్వహిస్తున్నాయన్నారు. తక్షణం వీటిపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు కె.రోహిత్, కె.గోవిందన్, సాయి తదితరులు పాల్గొన్నారు.

ఐద్వా నేత కరుటూరి రాధ కన్నుమూత

నివాళులర్పించిన నేతలు: నేడు అంత్యక్రియలు




రాధ భౌతికకాయానికి నివాళు లర్పిస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి - ఆచంట

ఐద్వా సీనియర్ నేత కరుటూరి రాధ (85) గురువారం ఆచంట వేమవరంలోని తన స్వగృహంలో ఆకస్మికంగా మృతి చెందారు. ఆమె భర్త కరుటూరి సత్యనారాయణ రైతుసంఘం నేతగా, సిపిఎం నేతగా జిల్లావాసులకు సుపరిచితులు. ఆయన గతంలో అనారోగ్యంతో మృతి చెందారు. ఈ దంపతులకు ఒక కుమార్తె అరుణ ఉన్నారు.

కరుటూరి రాధ మృతి పట్ల సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.బలరాం, రాష్ట్ర నేత మంతెన సీతారాం, జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్ సంతాపం తెలిపారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కేతా గోపాలన్, మండల కార్యదర్శి పి.మోహన్‌రావు, శాఖ కార్యదర్శి గుత్తుల రంగారావు, నాయకులు కొండేటి సత్యనారాయణ, సిర్రా విఘ్నేశ్వరుడు, సిర్రా నరసింహమూర్తి, అల్లుడు సత్యనారాయణ రాధ భౌతికకాయంపై సిపిఎం జెండా కప్పి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అంత్యక్రియలు శుక్రవారం ఉదయం ఏడు గంటలకు ఆచంటలో నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. రాధ అకాల మృతి పట్ల ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ, కౌలు రైతుల సంఘం జిల్లా కార్యదర్శి మామిడిశెట్టి రామాంజనేయులు, ఐద్వా జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కేతా పద్మజ, పి.పూర్ణ తదితరులు సంతాపం తెలిపారు.

కౌలురైతులు అందరికీ కార్డులివ్వాలని ధర్నా



డిప్యూటీ తహశీల్దార్ సోమేశ్వరరావుకు వినతిపత్రం అందజేస్తున్న నేతలు

ప్రజాశక్తి - ఆచంట

వాస్తవ సాగుదారులైన కౌలురైతులకు పెట్టుబడి సాయం రూ.20 వేలు ఇవ్వాలని, భూయజమానులతో సంబంధం లేకుండా కౌలుకార్డులు ఇవ్వాలని ఎపి కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి మామిడిశెట్టి రామాంజనేయులు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి, అనంతరం డిప్యూటీ తహశీల్దార్ ఎం.సోమేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రామాంజనేయులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పేరుతో ఇచ్చే పెట్టుబడి సాయం ఆరుగాలం కష్టపడి పంటలు పండించే కౌలురైతులకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం తెచ్చిన కౌలు చట్టాన్ని రద్దు చేసి కూటమి ప్రభుత్వం తయారు చేసిన చట్టాన్ని వెంటనే అమలు చేయాలన్నారు. గుర్తింపు కార్డులు లేని కౌలురైతులను గుర్తించి పెట్టుబడి సాయం, ప్రభుత్వ రాయితీలు, బ్యాంకు రుణాలు ఇవ్వాలని కోరారు. డిప్యూటీ తహశీల్దార్ సోమేశ్వరరావు మాట్లాడుతూ కౌలురైతుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. కార్యక్రమంలో నేతలు కేతా పూర్ణారావు, ఉందుర్తి శ్రీనివాస్, కొండేటి సత్యనారాయణ, మణికుమార్ తదితరులు పాల్గొన్నారు.

మూగజీవాలను వధిస్తే : డిఆర్ఒ

భీమవరం : మూగజీవాలను హింసించినా, వధించినా, అక్రమంగా రవాణా చేసినా చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా రెవెన్యూ అధికారి మొగలి వెంకటేశ్వర్లు హెచ్చరించారు. గురువారం జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా జంతు సంక్షేమ సంఘం సమావేశం డిఆర్ఒ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా డిఆర్ఒ మాట్లాడుతూ మనుషుల మాదిరిగానే జంతువులకు కూడా ఆకలి, దప్పిక, స్పర్శ కలిగి ఉంటాయని, సహజ సిద్ధ వాతావరణంలో జీవించాలని కోరుకుంటాయని తెలిపారు. మూగజీవాల పట్ల ప్రేమను కలిగి ఉండాలన్నారు. బక్రీద్ పండుగ సందర్భంగా ఆవులు, దూడలను వధించకూడదన్నారు. జంతు రవాణా చట్టం ప్రకారం పశువులను రవాణా చేయాలంటే పశుసంవర్ధక శాఖ నుండి ధ్రువీకరణ పత్రం తప్పనిసరిగా పొందాలన్నారు. ఎవరైనా చట్టాన్ని ఉల్లంఘిస్తే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. అనంతరం గోవధ నిషేధం చట్టం అవగాహన గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో జిల్లా పశు సంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ కె.మురళీకృష్ణ, గ్రామ, వార్డు సచివాలయ అధికారి వై.దోసిరెడ్డి, పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు జి.సత్యనారాయణ, వాణిజ్య పన్నుల శాఖ అధికారి ఎన్.గంగాధర్‌రావు, వివిధ శాఖల అధికారులు, జంతు సంక్షేమ కమిటీ సభ్యులు చెరుకువాడ రంగసాయి, ఎ.అజయ్‌కుమార్, ఆర్.గణేష్ పాల్గొన్నారు.

చదరంగం మేధాశక్తిని పెంపొందిస్తుంది

పోటీలను ప్రారంభించిన ఎంఎల్ఎ అంజిబాబు

ప్రజాశక్తి - భీమవరం టౌన్

చదరంగం మేధాశక్తిని పెంపొందిస్తుందని, చదరంగంతో విజ్ఞాన పరిజ్ఞానం, వ్యూహాత్మకత, కళానైపుణ్యం పెరుగుతుందని ఎంఎల్ఎ పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. గురువారం భీమవరం ఆర్యవైశ్య వర్తక సంఘం భవనంలో ఏర్పాటు చేసిన చదరంగ పోటీలను ఎంఎల్ఎ అంజిబాబు ప్రారంభించి మాట్లాడారు. చదరంగం ఆలోచనా శక్తిని పెంచుతుందన్నారు. అనంతరం టిడిపి రాష్ట్ర కోశాధికారి మెంటే పార్థసారథితో ఎంఎల్ఎ అంజిబాబు చదరంగం ఆటను ఆడారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.



ఎంఎల్ఎ అంజిబాబును సత్కరిస్తున్న టిడిపి నాయకులు

ఎంఎల్ఎను కలిసిన టిడిపి పట్టణ నూతన కార్యవర్గం

ప్రజాశక్తి - భీమవరం టౌన్

టిడిపి భీమవరం పట్టణ అధ్యక్ష, కార్యదర్శులుగా ఎన్నికైన మద్దుల రాము, చెల్లబోయిన గోవింద్ గురువారం ఎంఎల్ఎ పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు)ను కలిశారు. పదవులు బాధ్యతలను మరింత పెంచుతాయని, ఇచ్చిన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించాలని, కూటమి బలోపేతానికి కృషి చేయాలని ఎంఎల్ఎ అన్నారు. నూతనంగా ఎన్నికైన సభ్యులను అభినందించారు. అనంతరం వారు ఎంఎల్ఎను సత్కరించారు. కార్యక్రమంలో గంటా త్రిమూర్తులు, మైలబత్తుల ఐజాక్ బాబు, కారుమూరి సత్యనారాయణ మూర్తి, దొంగ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

వైసిపి యువనేత చందు మృతి

ప్రజాశక్తి - ఆచంట

వైసిపి ఆచంట యువ నేత నల్లూరి శరత్ చందు (48) అనారోగ్యంతో గురువారం మృతి చెందారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. చందు మృతి చెందడం పార్టీకి తీరనిలోటని పలువురు నేతలు తెలిపారు. పార్టీ ఆవిర్భావం నుండి చురుగ్గా పని చేస్తూ అభివృద్ధికి నిరంతరం కృషి చేశారని సర్పంచుల ఛాంబర్ మండల అధ్యక్షులు సుంకర సీతారామ్ తెలిపారు ఆయన ఆచంట సామూహిక హెల్త్ సెంటర్లో వైసిపి హయాంలో హాస్పటల్ అభివృద్ధి కమిటీ ఛైర్మన్‌గా పనిచేశారని తెలిపారు. చందు మృతికి మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు, వైసిపి మండల కన్వీనర్ జక్కంశెట్టి చంటి, సర్పంచులు కోట సరోజినీ వెంకటేశ్వరరావు, జక్కంశెట్టి శ్రీరామ్, గణేషుల శేషవేణి సుబ్బారావు తదితర నేతలు సంతాపం తెలిపారు.

వివేకానంద విద్యార్థులకు ప్రతిభ అవార్డులు

ప్రజాశక్తి - పెనుమంట్ర

మార్టేరుకు చెందిన వివేకానంద ఇంగ్లీష్ మీడియం స్కూల్లో చదివిన ఇద్దరు విద్యార్థులకు ప్రతిభ అవార్డులు లభించినట్లు స్కూల్ డైరెక్టర్ గుడిమెట్ల రామారెడ్డి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మక ప్రతిభా అవార్డులు తమ విద్యార్థులు చెల్లబోయిన ప్రణీత, కొవ్వూరి సింధు భవిత పొందడం పట్ల డైరెక్టర్, ఉపాధ్యాయులు, తల్లి దండ్రులతో పాటు, మండల విద్యా శాఖ అధికారులు వై.లక్ష్మీ నారాయణ, యు.నాగేశ్వరరావు అభినందనలు తెలిపారు.

యోగాసనాలు ఆరోగ్యకరం

ప్రజాశక్తి - తణుకు

యోగాను నిత్య జీవితంలో భాగస్వామ్యం చేసుకోవాలని ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ తెలిపారు. గురువారం తణుకు జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన యోగా ఆసనాల కార్యక్రమంలో పాల్గొని ఆయన మాట్లాడారు. యోగా దినోత్సవంలో భాగంగా విశాఖపట్నంలో 5 లక్షల మందితో ప్రధాని మోడీ పాల్గొనే విధంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. మానసికంగా, శారీరకంగా ఆరోగ్యంగా ఉండాలంటే యోగాను నిత్యజీవితంలో భాగస్వామ్యం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గణపవరం: యోగాసనాలు ఆరోగ్యకరమని ఎంపిడిఒ ఆర్.బేబీ శ్రీలక్ష్మి అన్నారు. గురువారం స్థానిక పంచాయతీ ఆవరణలో యోగాసనాలుపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి మూరా అలంకారం, కూటమి నాయకులు, పంచాయతీ కార్యదర్శి డిఎస్ఆర్.ప్రసాద్ పాల్గొన్నారు.

గూడెం రైల్వేస్టేషన్‌కు మహర్దశ

రూ.300 కోట్ల నిధులు మంజూరు : ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

వాణిజ్య కేంద్రంగా విరాజుల్లుతున్న తాడేపల్లిగూడెం రైల్వే స్టేషన్ అభివృద్ధికి నిధులు మంజూరయ్యాయని, సంవత్సర కాలంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, రైల్వే శాఖ అధికారుల సహాయ సహకారాలతో తాడేపల్లిగూడెం రైల్వే స్టేషన్ రూపురేఖలు మార్చి ప్రజలకు అంకితం చేస్తానని ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్ హామీ ఇచ్చారు. గురువారం సౌత్ సెంట్రల్ రైల్వే డిప్యూటీ ఇంజినీర్ పివి.రమణారావు, సీనియర్ సెక్షన్ ఇంజినీర్ ఎస్.శ్రీనివాస్, ఈతకోట తాతాజీ, అగర్వాల్, తాడేపల్లిగూడెం వివిధ రైల్వే అండర్ పాస్ బ్రిడ్జి వేయడానికి పర్యవేక్షణలో భాగంగా తాడేపల్లిగూడెం రైల్వే స్టేషన్, నవాబుపాలెం,జువ్వలపాలెం, పాతూరు శివాలయం, రైల్వే అండర్పాస్ బ్రిడ్జి నిర్మాణం కొరకు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రైల్వే డిప్యూటీ చీఫ్ ఇంజినీర్ శ్రీనివాస్ బృందంతో నేడు రైల్వే స్టేషన్ అభివృద్ధికి పర్యవేక్షించడం శుభా పరిణామమన్నారు. కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాస్ వర్మ సహకారంతో తాడేపల్లిగూడెం రైల్వే స్టేషన్ అభివద్ధికి రూ.23 కోట్లు, గూడ్స్ షెడ్లకు రూ.8 కోట్లు మంజూరు కాగా, ఎల్ సి నెంబర్. 374, 378, 379 వద్ద బ్రిడ్జిల నిర్మాణానికి అనుమతులు లభించాయన్నారు. జువ్వలపాలెం వద్ద రూ.110 కోట్లతో మూడో బ్రిడ్జిని నిర్మిస్తున్నామని తెలిపారు. మొత్తం రూ.300 కోట్లతో రైల్వే అభివృద్ధి పనులకు మంజూరు లభించిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఏసుబాబు, సర్వేర్ రామకృష్ణ, ఇరిగేషన్ డిఇ ఏసుబాబు, సుధారాణి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఎఇ మృతి

ప్రజాశక్తి - మొగల్తూరు

జాతీయ రహదారిపై జరిగిన ప్రమాదంలో సహాయ ఇంజినీర్ మృతి చెందిన సంఘటన గురువారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పెనుమంట్ర మండలం నెగ్గిపూడికి చెందిన కర్రి వెంకటరెడ్డి (45) సమగ్ర శిక్ష అభియాన్ కృష్ణాజిల్లా మచిలీపట్నంలో ప్రాజెక్ట్ సహాయ ఇంజినీర్‌గా పనిచేస్తున్నాడు. మచిలీపట్నం నుంచి కారులో ఆయన స్వగ్రామం గురువారం తెల్లవారుజామున బయలుదేరాడు. మొగల్తూరు ముత్యాలపల్లి గ్రామాల మధ్య ఉప్పుటేరు వంతెనపై తెల్లవారుజామున ఎదురుగా వేగంగా వస్తున్న రొయ్యల రవాణా వాహనం బలంగా కారును ఢీకొట్టి కొంత దూరం ఈడ్చుకెళ్లింది. దీంతో కారులో ఉన్న వెంకటరెడ్డికి తీవ్ర గాయాలయ్యాయి. అంతేకాకుండా ఆ వాహనం వంతెన రైలింగ్ ధ్వంసం చేస్తూ దూసుకెళ్లింది. వాహనంలోని క్లీనర్ ఉప్పుటేరులో పడి స్వల్పంగా గాయపడ్డాడు. డ్రైవర్‌కు గాయాలేమీ కాలేదు. సమాచారం అందుకున్న 108 సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని నరసాపురంలోని ఏరియా ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే వెంకటరెడ్డి మృతి చెందినట్లు నిర్ధారించారు. వెంకటరెడ్డి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

వాహనదారులు నిబంధనలు పాటించాలి: డిఎస్‌పి

ప్రజాశక్తి - నరసాపురం

వాహనదారులు రహదారి నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని నరసాపురం డిఎస్‌పి డాక్టర్ జి.శ్రీవేద అన్నారు. పట్టణంలోని మొగల్తూరు రోడ్డులో గురువారం పట్టణ సిఐ బి.యాదగిరితో కలిసి వాహన తనిఖీలు నిర్వహించారు. వాహనదారులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా డిఎస్‌పి మాట్లాడుతూ ఎవరైనా వాహనదారులు మద్యం సేవించి వాహనం నడిపితే జైలు శిక్ష తప్పదని హెచ్చరించారు. ప్రమాదాలు జరగకుండా ఉండాలంటే వాహనదారులు నిబంధనలు కచ్చితంగా పాటించాలన్నారు. హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని, తమ కోసం ఇంటి వద్ద భార్య, పిల్లలు తల్లితండ్రులు ఎదురుచూస్తూ ఉంటారనే విషయాన్ని గుర్తుపెట్టుకోవాలని వాహనదారులకు ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ సిహెచ్.జయలక్ష్మి పాల్గొన్నారు.

గోతులమయం గణపవరం - విప్పర్రు రోడ్డు..!

స్థానికులు, రైతుల అవస్థలు - పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి - గణపవరం

గణపవరం నుంచి విప్పర్రు వెళ్లే రహదారి గోతులమయంగా మారింది. నడవడానికి వీల్లేని విధంగా ఉన్నప్పటికీ రోడ్లు భవనాల శాఖాధికారులు పట్టనట్లు వ్యవరిస్తున్నారని స్థానికులు, రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గణపవరం పంచాయతీ పరిధిలోని ఈ రహదారి గుండా చిన రామచంద్రపురం, గణపవరం ప్రాంత వాసులు, రైతులు తమ వరి పొలాలకు ప్రతి రోజూ వెళ్తుంటారు. ఈ రహదారి నిర్మించి పదేళ్లయినా ఇప్పటి వరకూ అధికారులు మరమ్మతులు చేపట్టని పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో రోడ్డు పూర్తిగా గోతులు పడి వర్షం వస్తే గోతుల్లో నీరు చేరి చిన్నపాటి చెరువులను తలపిస్తున్నాయి. గణపవరం నుంచి విప్పర్రు వెళ్లే రహదారి వెంకయ్య వయ్యేరు గట్టుకు ఆనుకుని ఉంది. అయితే గోతులతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. విప్పర్రు నుండి తాడేపల్లిగూడెం కాలేజీలకు వెళ్లే విద్యార్థుల అవస్థలు ఇన్నీఇన్నీ కావు. అధికారులు వెంటనే స్పందించి రోడ్డు నిరించాలని ప్రజలు కోరుతున్నారు.



గోతులతో అధ్వానంగా ఉన్న గణపవరం - విప్పర్రు రహదారి

పర్యావరణ సమతుల్యతను కాపాడాలి



తాడేపల్లిగూడెం: మొక్కలు నాటుతున్న ఎంఎల్ఎ శ్రీనివాస్

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా స్థానిక గణేష్ నగర్ ఇండోర్ స్టేడియం వద్ద హరిత ఆంధ్రప్రదేశ్ వన మహోత్సవం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధికి ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి భవిష్యత్తు తరాల వారికి స్వచ్ఛ వాయువును అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎం.ఏసుబాబు, మున్సిపల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వెంకటరమణ, అధికారులు, కూటమి నాయకులు, వీర మహిళలు పాల్గొన్నారు.

వెంకటరామన్నగూడెం డాక్టర్ వైఎస్ఆర్ హార్టీ కల్చరల్ యూనివర్సిటీలో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపకులపతి కె.గోపాల్ మాట్లాడారు. అనంతరం యూనివర్సిటీ ప్రాంగణంలో ఉన్న కృషి విజ్ఞాన కేంద్రంలో మొక్కలు నాటారు. వాసవీ ఇంజినీరింగ్ కళాశాలలో యాజమాన్యం, ప్రిన్సిపల్, అధ్యాపక బృందం మొక్కలు నాటారు.

పెనుమంట్ర : ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకొని మొక్కలు నాటాలని ఉమ్మడి పశ్చిమగోదావరి జెడ్‌పి ఛైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ ప్రసాద్ అన్నారు. ఆలమూరు గ్రామ పంచాయతీ సచివాలయం ఆధ్వర్యంలో జరిగిన మొక్కలు నాటే కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. అనంతరం పంచాయతీ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. సర్పంచి, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

కాళ్ల: వేంపాడు గ్రామ పంచాయతీలో పర్యావరణ దినోత్సవాన్ని గురువారం నిర్వహించారు. పారిశుధ్య నిర్వహణ నిమిత్తం స్వచ్ఛందంగా రూ.2.80 లక్షల విలువచేసే స్వచ్ఛ రథాన్ని వేంపాడు గ్రామానికి చెందిన వేగేశ్న రామకృష్ణంరాజు (అభిరుచి రెస్టారెంట్ కుమారుడు వేగేశ్న వంశీకృష్ణ) వేంపాడు గ్రామ పంచాయతీకి బహూకరించారు. అనంతరం గ్రామంలో మొక్కలు నాటి, ప్లాస్టిక్ నిర్మూలనకై తీర్మానించారు. ఈ సందర్భంగా దాత వేగేశ్న వంశీకృష్ణను ఘనంగా సత్కరించారు. గ్రామ సర్పంచి యిర్రింకి పద్మావతి, శ్రీనివాసరావు, గ్రామ కార్యదర్శి ఎస్.వెంకటేష్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ తమ పెరట్లో మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలని వైద్యాధికారి డాక్టర్ సరాబు సునీల్ అన్నారు. కాళ్ల పిహెచ్‌సిలో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని నిర్వహించారు. వైద్యాధికారి సరాబు సునీల్ అధ్యక్షతన పిహెచ్‌సి ప్రాంగణంలో మొక్కలు నాటారు. అనంతరం వైద్యాధికారి మాట్లాడారు. సిహెచ్ఒ డి.విజయవతి, పిహెచ్‌సి సిబ్బంది రోగులు పాల్గొన్నారు. పెదఅమిరం గ్రామంలోని డిప్యూటీ స్పీకర్ కనుమూరు రఘు రామకృష్ణరాజు పార్టీ కార్యాలయంలో మొక్కలు నాటారు.

నరసాపురం : వైఎన్ కళాశాలలో ఎన్ఎస్ఎస్, ఎన్‌సిసి నరసాపురం మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మొక్కలు నాటారు. జూనియర్ డివిజన్ ప్రిన్సిపల్, సివిల్ జడ్జి ఆర్.వరలక్ష్మి పాల్గొని మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రక్రియలో భాగంగా అందరం విధిగా

ఘనంగా పర్యావరణ దినోత్సవం

మొక్కలు నాటాలని, ప్లాస్టిక్ వాడకం తగ్గించాలని సూచించారు. కళాశాల వైస్ ప్రెసిడెంట్ చినమిల్లి సత్యనారాయణ రావు, గవర్నింగ్ బాడీ సభ్యులు, అకడమిక్ అడ్వయిజర్ రంగినీడి సుబ్బారావు, ప్రిన్సిపల్ చింతపల్లి కనరారావు, వైస్ ప్రిన్సిపల్ బి.వెంకటరత్నం పాల్గొన్నారు.

భీమవరం టౌన్ : పర్యావరణ సమతుల్యతను కాపాడుకోవడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంఎల్ఎ



ఉండి : మొక్కలు నాటుతున్న సర్పంచి వెంకటకృష్ణ

పులపర్తి రామాంజనేయులు అన్నారు. గురువారం భీమవరం బ్యాంక్ కాలనీలోని మైత్రి కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఎంఎల్ఎ అంజిబాబు మొక్కలు నాటి మాట్లాడారు. పర్యావరణ పరిరక్షణ, కాలుష్య నివారణ, ప్లాస్టిక్ నిషేధంపై ప్రజలు అవగాహన పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

గణపవరం : పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఐసిడిఎస్ గణపవరం సెక్టార్ సూపర్‌వైజర్ పి.తులసి అన్నారు. అంగన్వాడీ కేంద్రం వద్ద మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు పచ్చని చెట్లు ప్రగతికి మెట్లు అని ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ, కార్యకర్తలు పాల్గొన్నారు. మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని ఎంపిడిఒ ఆర్.బేబీ శ్రీలక్ష్మీ, సర్పంచి మూరా అలంకారం అన్నారు. పంచాయతీ ఆవరణలో మొక్కలు నాటారు. పంచాయతీ కార్యదర్శి డిఎస్ఆర్.ప్రసాద్, కూటమి నాయకులు, ఆశాలు పాల్గొన్నారు.ఐసిడిఎస్ పిప్పర సెక్టార్ సూపర్‌వైజర్ సిహెచ్ దుర్గాభవానీతో కలిసి కోమర్రు గ్రామ సర్పంచి కేశవరపు శైలజ మొక్కలు నాటారు. ఈ సందర్భంగా శైలజ మాట్లాడుతూ మొక్కలు నాటితే పర్యావరణ రక్షణ కలుగుతుందని చెప్పారు కూటమి నాయకులు, పంచాయతీ కార్యదర్శి రామస్వాతి, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉండి : పచ్చని చెట్లు ప్రగతికి మెట్లు అని సర్పంచుల ఛాంబర్ అధ్యక్షులు, వాండ్రం సర్పంచి దాసరి వెంకటకృష్ణ అన్నారు. వాండ్రంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా తాగునీటి చెరువు గట్టు, డంపింగ్ యార్డ్ ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా దాసరి వెంకటకృష్ణ మాట్లాడారు. మానవాళి మనుగడకే కాదు జీవరాశికి కూడా పర్యావరణ సమతూకం ఎంతో అవసరం అన్నారు. గ్రామ పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్ కుమార్, సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

పాలకొల్లు అర్బన్ : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మొక్కలు నాటే కార్యక్రమాన్ని పూలపల్లి పంచాయతీ కార్యాలయ పరిధిలో నిర్వహించారు. టిడిపి గ్రామ అధ్యక్షులు వివి.శ్రీహరి రాజు, పంచాయతీ కార్యదర్శి పాల శ్రీనివాస్, గ్రామ నాయకులు గుబ్బల ప్రసాద్, పాలపర్తి చాంద్రాజ్, నున్నబోయిన నాగరాజు తదితరులు మొక్కలను నాటి పర్యావరణాన్ని కాపాడాలని పిలుపునిచ్చారు. దిగమర్రు గ్రామ సచివాలయం సర్పంచి రాపాక నగేష్ కరుణాకర్, సచివాలయ సిబ్బంది మొక్కలు నాటారు. రాపాక డేవిడ్ రాజు, ప్రసన్న పాల్గొన్నారు.

ఆకివీడు : పచ్చదనంతో పర్యావరణ పరిరక్షణతో పాటు మానవ రక్షణ కూడా జరుగుతుందని గుమ్ములూరు మండల పరిషత్ సభ్యులు కోపెల్ల హనుమ



కాళ్ల : వంశీకృష్ణను సత్కరిస్తున్న పంచాయతీ సిబ్బంది

అన్నారు. గుమ్ములూరులో ఉమర్ అలీషా రూరల్ డెవలప్మెంట్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పచ్చదనం మొక్కల పెంపకం కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం గ్రామంలో మొక్కలు పంపిణీ చేసి ర్యాలీ నిర్వహించారు.

అందరం కలిసి సమైక్యతతో పర్యావరణాన్ని కాపాడుదామని నగర పంచాయతీ కమిషనర్ కె.కృష్ణమోహన్ పిలుపునిచ్చారు. నగర పంచాయతీ కార్యాలయ ప్రాంగణంలో ఆయన మొక్కలు నాటి మాట్లాడారు. కార్యక్రమంలో నగర పంచాయతీ అధికారులు పాల్గొన్నారు.

వీరవాసరం : పర్యావరణాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరి పైనా ఉందని ఎంపిపి వీరవల్లి దుర్గాభవానీ చంద్రశేఖర్ అన్నారు. మండలంలో పలు పంచాయతీ పరిధిలో మొక్కలు నాటే కార్యక్రమాలు నిర్వహించారు. ఎంపిడిఒ కిరణ్‌కుమార్, సర్పంచులు చికిలే మంగతాయారు, వేంద్ర లీలావెంకటకృష్ణ, భీశెట్టి లక్ష్మి, ఎన్ఆర్ఇజిఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆచంట : పర్యావరణాన్ని పరిరక్షించుకోవాల్సిన ఆవశ్యకత ప్రతి ఒక్కరిపైనా ఉందని ఎంఎల్ఎ పితాని సత్యనారాయణ అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్స సందర్భంగా ఆచంట సామూహిక ఆరోగ్య హెల్త్ సెంటర్లో మొక్కలు నాటారు. పితాని మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఒక మొక్క నాటి స్వేచ్ఛకు పాటుపడాలని సూచించారు. ఎంపిడిఒ పూర్ణ బాబ్జి, తహశీల్దార్ జి.కనకరాజు, వైద్యాధికారులు శివరంజని, జితేంద్ర, ఇఒపిఆర్‌డి నరసింహారావు, ఎంపిపి దిగమర్తి సూర్యకుమారి, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

తణుకు : పర్యావరణాన్ని పరిరక్షించే బాధ్యత ప్రతి ఒక్కరూ తీసుకోవాలని ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ కోరారు. స్థానిక మున్సిపాల్టీ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఎంఎల్ఎ ప్రారంభించి మాట్లాడారు. ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ సాధించే లక్ష్యంతో రాష్ట్రంలో కోటి మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడుకొనే ఉద్దేశ్యంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. మున్సిపల్ కమిషనర్ టి.రామ్‌కుమార్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

మొగల్తూరు : ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పెంచాలని ఎంపిడిఒ సిహెచ్ త్రిశూలపాణి అన్నారు. మొగల్తూరులోని జెడ్‌పి ఉన్నత పాఠశాల ఆవరణలో మొక్కలు నాటి మాట్లాడారు. వైస్ ఎంపిపి కె.సుబ్బారావు, ఎంఇఒ శామ్యూల్ జాన్ ఉన్నారు. కెపిపాలెం జెడ్‌పి ఉన్నత పాఠశాలలో మొక్కలు నాటారు. పాఠశాల ప్రధానోపాధ్యాయిని పితాని ఇందిర మాట్లాడారు. **తణుకు :** పర్యావరణాన్ని కాపాడేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మాజీ వివర్స్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్మన్ వావిలాల సరళాదేవి అన్నారు. తణుకు బ్యాంక్ కాలనీలోని స్వతంత్ర సమరయోధుల ఉద్యానవనంలో మొక్కలు నాటారు. సరళాదేవి మాట్లాడారు. లైబ్రేరియన్ సుగుణకుమారి, శ్యామల, కె.దుర్గ పాల్గొన్నారు. పర్యావరణంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సీనియర్ సివిల్ జడ్జి కె.కృష్ణ సత్యలత, రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి కె.కృష్ణవేణి అన్నారు. కోర్టు ఆవరణలో మొక్కలు నాటి మాట్లాడారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు సూరంపూడి కామేష్, సంఘ సభ్యులు చోడే గోపాలకృష్ణ, పద్మావతి, కౌరు వెంకటేశ్వర్లు, పారాలీగల్ వాలంటీర్లు పాల్గొన్నారు.

రాయితీపై పశువుల దాణా పంపిణీ

ప్రజాశక్తి - మొగల్తూరు

ప్రభుత్వం పాడి రైతులకు రాయితీపై అందజేస్తున్న దాణాను వినియోగించుకోవాలని పశు వైద్యాధికారి జి.నీలిమ సూచించారు. పశువుల దాణా పంపిణీ కార్యక్రమాన్ని కొత్తోటలో సర్పంచి పడవల సత్యనారాయణ చేతుల మీదుగా గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా నీలిమ మాట్లాడుతూ మండలానికి ప్రభుత్వం 12 టన్నుల పశువుల దాణాను మంజూరు చేసిందన్నారు. 50 శాతం రాయితీపై అందిస్తున్న దాణాను వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో జనసేన నాయకులు కొల్లాటి గోపి, ఆకుల శ్రీనివాస్, పలువురు రైతులు పాల్గొన్నారు.

భూ సేకరణకు నోటిఫికేషన్

ప్రజాశక్తి - ఆకివీడు

జాతీయ రహదారి 165 పూర్తి నిర్మాణానికి గాను భూసేకరణలో భాగంగా మండలంలోని అజ్జమూరు గ్రామానికి చెందిన భూములను సేకరించేందుకు భారత ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసిందని తహశీల్దార్ నండూరి వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ ప్రకటనపై రైతులకు, ఎవరికైనా అభ్యంతరాలుంటే జెసికి తెలియజేయాలని సూచించారు. ఈ అభ్యంతరాలను ఈనెల 14వ తేదీలోగా జెసికి తెలపాలని చెప్పారు.

టిడిపి కమిటీలు సమన్వయంతో పనిచేయాలి

తోట సీతారామలక్ష్మి

భీమవరం టౌన్‌+ టిడిపి కమిటీలు సమన్వయంతో పని చేయాలని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి తోట సీతారామలక్ష్మి తెలిపారు. స్థానిక టిడిపి కార్యాలయంలో వీరవాసరం, భీమవరం మండలాలు, భీమవరం పట్టణ కమిటీ అధ్యక్ష కార్యదర్శులతో గురువారం సమావేశం నిర్వహించారు. నూతనంగా ఎన్నికైన అధ్యక్ష కార్యదర్శులు తోట సీతారామలక్ష్మికి పుష్పగుచ్ఛాలు అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా సీతారామలక్ష్మి మాట్లాడుతూ నూతన అధ్యక్ష కార్యదర్శులకు శుభాకాంక్షలు తెలుపుతూ కమిటీ నాయకులంతా సమన్వయంతో పనిచేస్తూ ముందుకెళ్లాలన్నారు. అనంతరం టిడిపి వీరవాసరం మండల కమిటీ అధ్యక్షునిగా కొల్లేపర శ్రీనివాస్, ఉపాధ్యక్షునిగా యరకరాజు గోపాలకృష్ణంరాజు, ప్రధాన కార్యదర్శిగా వీరవల్లి శ్రీనివాస్ కార్యనిర్వాహక కార్యదర్శులుగా మేక వెంకట సుబ్బారావు, బండి నాగలక్ష్మి, బయనపాలెం సత్యనారాయణ, కార్యదర్శులుగా దుసనపూడి వెంకటేశ్వరరావు నేపాల నాగమల్లేశ్వరరావు, మురాళ్ల యేసురత్నం, కోశాధికారిగా ఆదిరెడ్డి శ్రీనివాస్, మరో 10 మంది కార్యవర్గ కమిటీని నియమించారు. భీమవరం మండల టిడిపి కమిటీ అధ్యక్షునిగా కోయ్యలగడ్డ గణపతి, ఉపాధ్యక్షునిగా పెనుమత్స సుమన్‌రాజు, ప్రధాన కార్యదర్శిగా కోళ్ల సీతారాం, కార్యనిర్వాహక కార్యదర్శులుగా బి.వెంకటాంజన, రేవులగడ్డ మేరిరత్నం నడకుడిటి సత్యనారాయణ కార్యదర్శులుగా చింతపల్లి జీవరత్నం, బస్వాని వెంకటరమణ, కుక్కల తారక రామారావు, కోశాధికారిగా పెంటపాటి రిషికేశ్వరరావు, మరో 10 మందితో కార్యవర్గాన్ని నియమించారు. టిడిపి భీమవరం పట్టణ అధ్యక్షునిగా మద్దుల రాము, ఉపాధ్యక్షునిగా కొత్తపల్లి అప్పలరాజు, ప్రధాన కార్యదర్శిగా చల్లబోయిన గోవిందరావు, కార్యనిర్వహక కార్యదర్శులుగా నేదునూరి గంగాధర్ తిలక్, సతివాడ హరిబాబు ఎండి అసలంపాషా, కార్యదర్శిగా యాల్ల సురేష్‌బాబు, చోడిశెట్టి నారాయణస్వామి, గంధం రాధ, కోశాధికారిగా మండవల్లి ఈశ్వర్ 10 మంది కార్యవర్గ కమిటీని నియమించారు. టిడిపి వీరవాసరం మండల అధ్యక్షుడు కొల్లేపర శ్రీనివాస్, ఐటిడిపి అధ్యక్షుడు కడలి వాసు, భీమవరం మండల అధ్యక్షుడు కొయ్యలగడ్డ గణపతి, కార్యదర్శి కోళ్ల సీతారాం తదితరులు పాల్గొన్నారు.

అనాథల్లా బయటే ప్రసవాలు..!

వీరవాసరం పిహెచ్‌సి పరిధిలో వెలుగు చూస్తున్న ఘటనలు

ప్రజాశక్తి - వీరవాసరం

వీరవాసరం పిహెచ్‌సి పరిధిలో అనాథ ప్రసవాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారింది. గత కొద్ది రోజులు ముందు మత్స్యపురిలో ఓ గర్భిణి పొలం గట్టుపై ప్రసవించింది. గురువారం మరో గర్భిణి నందమూరుగరువు సమీపంలో అనాథగా ప్రసవం చేసినట్టు సమాచారం. అయితే ఈ ప్రసవం వీరవాసరం పిహెచ్‌సిలో జరిగినట్టు నమోదు చేసినట్టు చెప్పుకుంటున్నారు. వాస్తవాలు వైద్యాధికారులు తేల్చాల్సి ఉంది. నెల్లూరు నుండి చీపుర్లు అమ్ముకోవడానికి వచ్చిన బదనాపురి మాధవి పురిటి నొప్పులు పడుతుండగా భర్త మణి 108లో వీరవాసంర పిహెచ్‌సికి తీసుకొచ్చినట్టుగా చెబుతున్నారు. అయితే ఆ ప్రాంతంలో ఒక గర్భిణీ ఉన్నట్టు గుర్తించాల్సిన బాధ్యత ఎవరిది? ప్రసవం జరిగే తేదీ గుర్తించి ఆమెను ముందుగానే ఆసుపత్రికి చేర్చాల్సిన బాధ్యత ఎవరిది? అందుకు తగ్గట్టుగా వైద్య సేవలు గర్భిణీకి అందాయా లేదా.! అందితే ముందుస్తుగా ఆమెను ఆసుపత్రికి ఎందుకు చేర్చలేదో తదితర విషయాలు తేలాల్సి ఉంది. కొంత మంది సంచార జాతుల వారు వీరవాసరం మండల పరిసరాల్లో జీవనోపాధి పొందుతున్నారు. వీరిలో నెలలు నిండిన గర్భిణులు ఉన్నారు. వైద్యం పట్ల అవగాహనా లేమి, ప్రభుత్వం వైద్యం ఎలా పొందాలో తెలియని స్థితిలో వీరు ప్రమాదకర పరిస్థితుల్లో ప్రసవ వేదనలు అనుభవిస్తున్నారు. ప్రసవం ఎప్పుడు వస్తుందో తెలియని పరిస్థితుల్లో ఇలా అనాథ ప్రసవాలు జరుగుతున్నట్టు తెలుస్తోంది. ప్రసవం జరిగే సమయంలో భర్త అందుబాటులో ఉంటే పరవాలేదు. అలా లేని పక్షంలో వారి పరిస్థితి ఏంటన్నది ఆలోచంచాల్సి ఉంటుంది. ఇటువంటి వారిని గుర్తించి వారికి తగు సూచనలు ఇవ్వాల్సిన ఆరోగ్య సిబ్బంది, ఆశాలు విఫలమవుతున్నట్టు జరిగిన సంఘటనలు బట్టి తెలుస్తోంది. క్షేత్ర స్థాయిలో కిందిస్థాయి ఆరోగ్య సిబ్బంది సక్రమంగా విధులు నిర్వర్తిస్తున్నారో లేదో పర్యవేక్షించాల్సిన పైస్థాయి అధికారులు కార్యాలయాలకే పరిమితం కావడంతో కింది స్థాయి సిబ్బంది నిర్లక్ష్యంగా ఉంటున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికైనా ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా వైద్యాధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పేద కుటుంబానికి సాయం

ప్రజాశక్తి - కాళ్ల

కాళ్లకూరులోని కొత్త కాలనీకి చెందిన ఏరేటి పెద్దింట్లమ్మ అనారోగ్యంతో మృతి చెందింది. పేద కుటుంబం కావడంతో మట్టి ఖర్చుల నిమిత్తం దాట్ల శ్రీదేవి మెమోరియల్ ట్రస్ట్ అధినేత డాక్టర్ దాట్ల వెంకటరామరాజు ఆధ్వర్యాన పెద్దింట్లమ్మ మనవడు కన్నం నాయుడికి ఐదు వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని ట్రస్ట్ సభ్యులు పెన్మెత్స నాగరాజు గురువారం అందజేశారు.

ఆశా పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలి

గణపవరం: పిప్పర పిహెచ్‌సి పరిధిలోని గ్రామాల్లో వైద్య సేలందించడానికి ఆశా కార్యకర్తలు దరఖాస్తు చేసుకోవాలని డాక్టర్ కె.ప్రియాంక గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆశా కార్యకర్తగా వచ్చేవారు ఆ గ్రామ కోడలై ఉండాలని చెప్పారు. అలాగే వయస్సు 25 నుంచి 45 సంవత్సరాల్లోపు ఉండాలని, పదో తరగతి పాసై ఉండాలని తెలిపారు. దరఖాస్తులు ఈ నెల పదో తేదీలోపు ఆరోగ్య కేంద్రానికి అందజేయాలని తెలిపారు. పిప్పర ఒకటిలో ఒకటి, పిప్పర రెండులో ఒకటి, కోమర్రు డికెవల్లిలో ఒక పోస్టు ఖాళీగా ఉన్నట్లు చెప్పారు.

అన్నదానం అభినందనీయం

మొగల్తూరు: ఆధ్యాత్మిక కార్యక్రమంతో అన్నదానం చేయడం అభినందనీయమని మాజీ మంత్రి కొత్తపల్లి సుబ్బారాయుడు అన్నారు. కడలవారిపాలెంలో నూతన ఆలయం నిర్మించి గురువారం సీతారామ లక్ష్మణ ఆంజనేయ విగ్రహాలు ప్రతిష్టించారు. కార్యక్రమాల్లో మాజీ ఎంఎల్ఎలు కొత్తపల్లి జానకీరామ్, బండారు మాధవనాయుడు, తెదేపా నరసాపురం నియోజకవర్గం ఇంచార్జ్ పొత్తూరు రామరాజు తదిరులు పాల్గొన్నారు. అనంతరం ఏర్పాటు చేసిన అన్న సమారాధన కార్యక్రమంలో అధిక సంఖ్యలో ప్రజల పాల్గొన్నారు.

యూనియన్ బ్యాంక్ ఆధ్వర్యంలో వ్యవసాయ రుణ శిబిరం

మొగల్తూరు: వ్యవసాయ అనుబంధ రంగాలకు యూనియన్ బ్యాంక్ ఆధ్వర్యంలో అందిస్తున్న రుణాలను సద్వినియోగం చేసుకోవాలని ఆ శాఖ డిప్యూటీ డివిజినల్ హెడ్ ఎం.వెంకన్నబాబు సూచించారు. స్థానిక యూనియన్ బ్యాంక్ ఆవరణలో ఏర్పాటు చేసిన అవగాహనా సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. తమ శాఖ వ్యవసాయ రుణాలు రూ.70 కోట్లు మంజూరే లక్ష్యంగా పని చేస్తుందన్నారు. కార్యక్రమంలో జిల్లా లీడ్ బ్యాంక్ అధికారి నాగేంద్రప్రసాద్, చీఫ్ మేనేజర్ శ్రీధర్, వ్యవసాయ శాఖ అధికారి ఎ.అబ్దుల్ రహీమ్, పశు వైద్యాధికారి జి.నీలిమ,రైతులు పాల్గొన్నారు.

నిరాధార ఆరోపణలు చేస్తే ఊరుకోబోం

మాజీ మంత్రి కారుమూరిపై ఎంఎల్ఎ రాధాకృష్ణ విమర్శ

ప్రజాశక్తి - తణుకు

తనపైనా, తన కుటుంబం పైనా నిరాధారమైన ఆరోపణలు చేస్తున్న మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు వాటిని నిరూపిస్తే తాను ఎంఎల్ఎ పదవికి రాజీనామా చేస్తానని తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ సవాల్ విసిరారు. గురువారం తణుకు కూటమి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇంట్లో మహిళల గురించి నోటికి వచ్చినట్లు మాట్లాడితే ఊరుకోనని తెలిపారు. రాజకీయంగా పోరాడాను.. రాజకీయంగా నువ్వు చేసిన తప్పులు ఎత్తి చూపాం.. రాజకీయంగా చేసిన అక్రమాలు వెలికి తీశాం అంతే తప్ప తాను ఏనాడూ వ్యక్తిగతంగా దూషించలేదన్నారు. నీ మానసిక పరిస్థితి ఏంటో తెలుసుకోవాలని కారుమూరిని ఉద్దేశించి ఘాటు వ్యాఖ్యలు చేశారు. కొందరు వైసిపి నాయకులు సైతం తమ పార్టీ నాయకులతో సోదరభావంతో ఉంటూ గౌరవప్రదమైన రాజకీయాలు చేస్తున్నారని గుర్తు చేశారు. అసందర్భ పూరిత వ్యాఖ్యలు చేస్తే సహించబోమని తెలిపారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ముగిసిన వేసవి విజ్ఞాన తరగతులు

పాలకొల్లు : 40 రోజులుగా స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహించిన సమ్మర్ క్యాంప్ గురువారం ముగిసింది. పర్యావరణ దినోత్సవ సందర్భంగా విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు. పట్టణంలోని హైస్కూల్, ఎలిమెంటరీ స్కూల్స్, యుపి స్కూల్ విద్యార్థులు ఆటపాటలతో కూడిన కథలు, కథనాలుపై బోధించారు. క్లాసులో చురుకుగా ఉండాలంటే నిత్యం యోగా చేయడం అలవర్చుకోవాలని నేర్చుకున్నారు.